# ఉన్నమాట

కలువకొలను సదానంద



"అంబ పలుకు జగదంబా పలుకు
కంచిలోని కామాక్షి పలుకు
మధురలోని మీనాక్షి పలుకు
కాశీ విశాలాక్షి పలుకు
ఉన్నమాట వున్నట్లే పలుకూ"

**అంటూ** ఒకనాటి వేకువజామున మగుణవరం గ్రామంలోని నిశ్శబ్దతను చీల్చుకుంటూ ఒక బుడబుడక్కల వాడి కంచుగొంతుక, దానితో శ్రుతి గలుపుతూ అతని చేతిలోని డమరుక ఒక్కసారిగా మ్రోగాయి.

విశాల ఫాలభాగంలో తేటతెల్లని విభూతి రేఖల నడుమ చందనపు బొట్టుతో, ధనుస్సులా వంగిన ఒత్తైన కనుబొమలతో, ఒక్క చూపు తూపుతోనే మనిషిని భయ విహ్వలుణ్ణి చేసివేయగల కన్నులతో, దృఢ వదనమూ, ఆ దృఢవదనానికి నిండుదనాన్ని చేకూర్చే నల్లని గుబురు మీసలతో, అన్నిటినీ మించి గింగురుమంటూ కర్ణపటలాన్ని ప్రకంపింపజేసే కంచు గొంతుకతో, నడకలో, నిలబడిన తీరులో, హావభావాల్లో ఈ భూతల వాసులకు తానతీతుడ ననిపింపజేసే ప్రత్యేకతతో గిలకను టకటక లాడిస్తూ, గ్రామ వాసుల నిదుర మత్తును చెదరగొడుతూ వీధులలో నడయాడుతున్న ఆ బుడబుడక్కల వాడిని చూస్తే—మారువేషంలో కైలాస గిరినుండి భూతలానికి దిగి వచ్చిన పరమశివుడా ఈతడు? అనిపించక మానదు!

అతని పేరు జంగం నిజలింగభట్టు. వ్యవహార నామం నిజలింగప్ప. అతడు మగుణవరానికి క్రొత్తవాడే. కాని, యిక్కడ కొత్త పాతల ప్రసక్తి వచ్చినప్పుడు చెప్పవలసిందేమంటే— అతని చేతి గిలక గొంతుక విప్పిన నాటికి అతడు బుడబుడక్కల వేషంలో మాత్రమే ఆ ఊరికి క్రొత్తవాడు! అతడా ఊరిలో కాలుమోపి పదిరోజులైంది.

కామన్నది కమలభవుడెరుగునేమోగాని, నిజలింగప్ప జరిగినది జరిగినట్లు, ఉన్నది ఉన్నట్లు

చెప్పగల ప్రజ్ఞాశాలి! "నేనన్న మాట పొల్లయితే రావణుని జంపినవాడు రాముడుకాడు; రామాయణం వ్రాసిన వాడు వాల్మీకికాడు" అంటాడు నిజలింగప్ప. అయినా—యీ నాటి వరకూ "నువ్వన్నది పొల్లు" అని ఏ ధీశాలి కూడా నిజలింగప్ప పవాలును ఖండించలేదు. అతని పలుకు లాలకించి ప్రతివారూ—"ఆహా! నిజం!"

"ఔరా! సత్యం!"

"భళీ! వాస్తవం!" అంటూ పట్టరాని కుతూహలంతో స్తోత్రపాఠాలు చదివిన వాళ్ళే!

చాల మంది "పీడు త్రికాలజ్ఞుడులా ఉన్నాడు" అనీ, "అంబను వశం చేసుకున్నట్టున్నాడు" అనీ ఆపోహపడి, ఆశ్చర్యంతో ముక్కున వేలువేసుకున్నారు కూడా. కానీ, అతడేమీ త్రికాలజ్ఞుడూ కాడు, అంబను వశం చేసుకోనూ లేదు, మరే మంత్రసిద్ధీ పొందలేదు. లోకు లెరుగనిదీ, అతడుమాత్ర మెరిగినదీ ఒక్కటుంది. అతడొక క్రొత్త గ్రామంలో జోస్యం చెబుతున్నాడంటే—అతడా గ్రామంలో పది రోజుల నుంచీ అజ్ఞాతంగా ఉన్నాడన్నమాట! ఒక సామాన్యుడులా సుగుణవరానికి వచ్చిన నిజలింగప్ప పది రోజుల తరబడి గ్రామంలో ముఖ్యమైన మనుష్యు లెవరో, వారి గుణగణాలు, కుటుంబ విషయాలు ఏమిటో రహస్యంగావాకబుచేసి తెలుసుకుని, పదకొండో రోజు—తలపాగా, అంగీ, గిలక, విభూతి రేఖలు, రెండువైపులా రెండుజతల జోలెలు మొదలైన హంగులతో బయలుదేరాడు.

. . . ఆ ఊరికి సుగుణవరమని పేరెవడు పెట్టాడోగాని అతగాడికి బహుశా తులసిమొక్కకు గంజాయి మొక్కకు భేదమేమిటో తెలిసిఉండదు. కాకపోతే సుగుణవరమేమిటి?... అది దుర్గుణవంతులకు ఆలవాలమూ!... శివశివ!...ఆ ఊళ్ళో ప్రముఖమైన దుస్స్వభావాలన్నీ ఎవరికున్నాయంటే—ఆ పుర ప్రముఖులకే!... వారిలో ఒకతను పైకి చాలా సాధువు. నిజానికి—ఒక గొప్ప దొంగ! మరొకడు ప్రభుత్వాభిమాని; కాదుబాబో, అతడియింటి పెరట్లో సారాబట్టీ ఉంది! ఇంకొకడు భారత కథ ద్వారా ప్రజానీకానికి నీతిబోధ చేసే హరిదాసు. స్వీయజీవితంలో అతడు జారంలో సాక్షాత్తూ ధర్మరాజు! మరొక వ్యక్తి శాంతి భద్రతల రక్షణార్థం, అవినీతి నిర్మూలనార్థం ప్రభుత్వం నియమించిన అధికారి. అయినంతమాత్రాన పాపమాతడు లంచాల కోసం జేబులు చూపుతున్నాడే కాని, చేతులేమైనా చాపుతున్నాడా? . . .

. . . వారి చరిత్రనంతా చెప్పమని నిజలింగప్ప ఆ వేకువ జామున అంబను వేడుకుంటున్నాడు...

"జరిగింది చెబుతాను జరిగేది చెబుతాను
మనసులో దాగున్న మర్మాలు జెబుతాను..."

• • •

నిజలింగప్ప జీవితంలో నేటి వరకు తాను పట్టిందంతా బంగారమే! రాంపిచెర్లలో రంగధామ శ్రేష్ఠిగారు అపర దానకర్ణులు, పాకాలలో మునస్వామి ఆచారి పరమ భక్తుడు, పులిచెర్ల రెడ్డిగారు పులివేటలో సిద్ధహస్తులు. పైన పేర్కొన్న వారు నిజలింగప్పకు ఋణమో పణమో యిచ్చి సత్కరించిన ఉదారులు! కాని, ఆ ఔదార్యం నేడు సుగుణవరంలో లోపించింది. నిజలింగప్ప శకునం విన్న ప్రతిగృహస్థూ అతడిపైన భగ్గున మండి పడ్డాడు. కొందరు నానా తిట్లూ తిట్టారు. "భద్రం! ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు! లేకపోతే ఎముకలు విరగదంతా" మన్నారు మరి కొందరు. అంతటేమి ఆ ప్రభుత్వాధికారి చెయ్యనే చేశాడు!...శివోహం!

గ్రామాంతరాలలో ఔదార్యం నిండి చింది పోవడానికీ, ఇక్కడ సుగుణవరంలో అది లోపించడానికీ గల కారణం—మరేదో కాదు. నిజలింగప్ప నిజాయితీ! అతడు యథార్థ భాషి. ఉన్నమాట


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

### 'బాలప్రభ' పాఠకులకు కానుక

"పెద్దలకు కథల పోటీలూ, నవలల పోటీలూ అవీ నిర్వహిస్తున్నారు; మరిమామాట ఏమిటి?" అని మా 'బాలప్రభ' పాఠకులు చాలాకాలంగా అడుగుతున్నారు. మా ప్రకటన కొరకు వేచి ఉండమని ఒకసారి కోరిఉన్నాము.

'ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక' 1962 ఆగస్టు 15 వ తేదిని జన్మదిన సంచికగా వెలువడుతున్నది. దానిని **బాల బాలికల ప్రత్యేక సంచిక** గా రూపొందించాలని సంకల్పించాము. ఆసందర్భంలో

## బాలబాలికల కథల పోటీ

నిర్వహించాలని నిశ్చయించాము. 'బాలప్రభ' పాఠకులు మా యీ కానుకను స్వీకరించి, మా ప్రయత్నం విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడగలరని విశ్వసిస్తున్నాము.

### పోటీ నిబంధనలు :

పదహారు సంవత్సరాల లోపు బాల బాలికలు మాత్రమే ఈ పోటీలో పాల్గొన వచ్చు. స్వీయ రచనలే కాని అనువాదాలు, అనుసరణలు పంపరాదు. కథలు అచ్చులో ఒక 'కాలమున'కు మించరాదు. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవి ప్రచురించే హక్కు మాకు ఉన్నది. పోటీకి కథలు పంపేటప్పుడు 'బాల బాలికల కథల పోటీకి' అని స్పష్టంగా పేర్కొనవలసి ఉన్నది. పోటీకి పంపే కథలను త్రిప్పి పంపడం జరుగదు. కనుక స్టాంపులు పంపరాదు.

మొదటి బహుమతి రు 100 లు

రెండవ బహుమతి రు 60 లు

మూడవ బహుమతి రు 40 లు

*బహుమతి పొందిన కథలను జన్మదిన సంచికలో ప్రచురించగలము*

| కథలు మాకుచేరవలసిన ఆఖరి తేదీ | 1962 జూలై 15 |
| --- | --- |

ఎడిటర్